తేది:30-01-2007

# స్థానిక ఎన్నికలు - పార్టీ విధానం

విశాఖపట్నం, రాజమండ్రి నగరాలలోను, హిందూపూర్ పట్టణంలోను స్థానిక ప్రభుత్వాల ఎన్నికలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. చాలామంది లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు, సభ్యులు, అభిమానులు ఈ ఎన్నికలలో పోటీచేయాలని, పార్టీ ప్రతిపాదిస్తున్న నూతన రాజకీయాలకి స్థానిక ప్రభుత్వాలలో నాందిపలకాలని ఉత్సాహపడుతున్నారు.

ఈ అంశాన్ని పార్టీ నాయకత్వం కూలంకషంగా పరిశీలించింది. స్థానిక ప్రభుత్వాల సాధికారతకోసం, జిల్లా ప్రభుత్వాల నిర్మాణంకోసం, నగరాలలో, పట్టణాలలో మౌళిక సదుపాయాల మెరుగుదల కోసం లోక్‌సత్తా పార్టీ పూర్తిగా కట్టుబడిఉన్నదన్నది సర్వవిదితం. మన దృక్పథంలో జాతీయ, రాష్ట్రస్థాయిలలోకన్నా, స్థానికంగా ఎన్నుకున్న ప్రభుత్వమే పౌరుడి రోజువారీ జీవనాన్ని ప్రభావితం చెయ్యాలి. ప్రజలు వేసేఓటుకి, వారికి అందే పాలనకి మధ్యనున్న సంబంధం అందరికీ స్పష్టమవ్వాలంటే స్థానిక ప్రభుత్వాల లోనే అదిసాధ్యం. మనంకట్టే పన్నులకి, మనకందే సేవలకి మధ్య సంబంధం పటిష్ఠపడాలన్నా, పన్నుడబ్బు సద్వినియోగం కావాలన్నా, అది స్థానికంగానే సాధ్యం. అధికారం, జవాబుదారితనం మిళితం కావాలంటే అది స్థానిక ప్రభుత్వాల వలనేసాధ్యం. ఈకారణాలుగా లోక్‌సత్తాపార్టీకి స్థానిక ప్రభుత్వాలని గూర్చిన స్పష్టమయిన అవగాహన, వాటిసాధికారతను సాధించాలన్న దృఢసంకల్పం ఉన్నాయి. ఈ కారణాలుగా స్థానిక ప్రభుత్వాల ఎన్నికలలో పోటీ చెయ్యటానికి పార్టీ సభ్యులు ముందుకురావటం సహజం.

అయితే ఇటీవలనే ప్రారంభించిన లోక్‌సత్తా పార్టీ ఎన్నికలలో పోటీకి దిగేముందు రెండు ఏర్పాట్లు పూర్తికావాలి.

1. లోక్‌సత్తాపార్టీ కొత్తరాజకీయాన్ని ప్రతిష్ఠించటంకోసం పుట్టింది. అందులో భాగమే కొత్తరీతిలో రాజకీయపార్టీని నడపటం. పార్టీ సభ్యులు, నాయకత్వం కేవలం సమాజానికి ప్రతినిధులు, కొత్తరాజకీయ సంస్కృతికి ధర్మకర్తలు మాత్రమే. అందువల్ల పార్టీని నాయకుల స్వంత ఆస్తిగాకాక, సభ్యుల సంస్థగాను, సమాజ సంపదగాను తీర్చిదిద్దటంకోసం మొదట ఏర్పాట్లు పూర్తికావాలి. పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిస్థాయిలో రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుపుకుని నాయకత్వాన్ని నిర్ణయించుకోవటం అవసరం. ప్రస్తుతం తాత్కాలిక కమిటీలద్వారా పార్టీని ప్రారంభదశలో నడుపుకొంటున్నాం. అంతకుమించి, మన పార్టీతరపున పోటీచేసే అభ్యర్థుల ఎంపిక బహిరంగ ప్రాథమిక ఎన్నికలద్వారాజరగాలి. అంటే పార్టీ సభ్యులు, ఆ నియోజకవర్గంలోని ఇతర ఓటర్లు రహస్య బ్యాలెట్ ద్వారా, ప్రత్యామ్నాయ ఓటింగ్‌పద్ధతిలో లోక్‌సత్తా పార్టీ తరపున తమ అభ్యర్థిగా ఎవరుండాలో నిర్ణయించుకోవాలి. పోటీకిదిగే అభ్యర్థుల అర్హతలని పరిశీలించి వారికి ప్రాథమిక ఎన్నికలలో పోటీకి అవకాశాన్ని కల్పించటంతప్ప పార్టీ నాయకత్వానికి అభ్యర్థుల ఎంపికలో పరిమిత పాత్ర మాత్రమే ఉండాలి. ఆవిధంగా అభ్యర్థులని స్థానిక సభ్యులు, ఇతర ఓటర్లు ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక చేసుకున్నప్పుడే కొత్తరాజకీయాన్ని మనం సమాజంలో ప్రతిష్ఠించి, ఆ అభ్యర్థులని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన అభ్యర్థులుగా ఎన్నికలలో నిలబెట్టగలం. ఇప్పుడు ఈ ఎన్నికలు అకస్మాత్తుగా రావటంతో లోక్‌సత్తా పార్టీకి ఈ ప్రజాస్వామ్య ప్రక్రియని సకాలంలో పూర్తిచేసే అవకాశంలేదు.

2. మనదృష్టిలో ఎన్నిక అనేది కేవలం అధికారంకోసం కొందరు అభ్యర్థులమధ్య పోరాటంకాదు. ఓ ఎన్నిక ఆతరువాత పాలన ఎలా ఉండాలో ప్రజలు నిర్ణయించుకుని ఆమోదించటానికి మార్గం కావాలి. అంటే కేవలం ఓపార్టీ బదులు మరోపార్టీ కాకుండా, నిర్దిష్ట లక్ష్యాలకోసం ఎన్నిక జరగాలి. ఆ లక్ష్యాలేమిటో, ఎన్నికల అనంతరం ఏ ఫలితాలని ఆశించవచ్చో, ఆ ఫలాలు ఎలాదక్కుతాయో ప్రజలకి పూర్తిగా అర్థమైతేనే ఎన్నికలలో ఎవరు నెగ్గినా ప్రజలకి ప్రయోజనం చేకూరుతుంది. ఆవిధంగా స్థానిక ప్రభుత్వాలలో

మన ఎజెండా ఏమిటో ప్రజలకి సవివరంగా, స్పష్టంగా తెలియజెప్పాలంటే, అందుకు సమయము, తగిన ఏర్పాట్లు కావాలి. ఈ కొద్ది వ్యవధిలో ప్రజలకి మన ఎజెండాని గూర్చి వివరించి వారిని సిద్ధంచేయటం సాధ్యంకాదు. ఎజెండా ప్రజలలోకి సరిగ్గా వెళ్ళకుండా మనం ఎన్నికలలో నెగ్గినా ప్రయోజనం పరిమితమే. కేవలం ఆటగాళ్ళమార్పుకోసం కాక, ఆటనియమాల మార్పుకోసం మనం రాజకీయ పార్టీగా ఏర్పడ్డాం.

ఈ రెండుకారణాలుగా విశాఖ, రాజమండ్రి, హిందూపూర్ ఎన్నికలలో పోటీకి లోక్‌సత్తా పార్టీ సిద్ధంగాలేదు. అయితే లోక్‌సత్తాపార్టీ ఈ ఎన్నికలలో స్తబ్దంగా ఉండదు. స్థానిక ప్రభుత్వాల కోసం మనపార్టీకి చాలాబలమైన, నిర్దిష్టమైన ఎజెండాఉంది.

1. ప్రతివార్డుకి స్థానిక ప్రతినిధులతో, ఎన్నికయిన కార్పొరేటర్/కౌన్సిలర్ అధ్యక్షుడుగా ఓ వార్డుకమిటీ ఉండాలి. స్థానిక ప్రతినిధులని ప్రతి పోలింగ్ స్టేషన్ ప్రాంతంనుంచి ప్రజలే ప్రత్యక్షంగా వార్డు కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలి.

2. వార్డు కమిటీ పర్యవేక్షణలో స్థానికంగా నిర్ణయించగల, నిర్వహించగల అంశాలన్నీ ఉంచాలి. స్థానికంగా పారిశుద్ధ్యం, చెత్తనిర్మూలన, వీధిలైట్లు, స్థానిక పాఠశాల, వీధులనిర్వహణ, నీటికొళాయిలు, అక్కడి వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వీధులకి సైన్‌బోర్డులు - ఇవన్నీ వార్డుకమిటీ పరిధిలోనే ఉండాలి.

3. ఆవార్డునుండి వసూలయిన పన్నులలో వాటాని, ఆవార్డు పరిస్థితినిబట్టి 25 శాతం నుండి 100 శాతం వరకు ఆ వార్డు కమిటీ ఆధ్వర్యంలోనే ఉంచాలి. వార్డుకమిటీ పర్యవేక్షణలో ఉన్న అంశాలకి సంబంధించిన సిబ్బంది జీతభత్యాలు, వారి పనితీరుపై అజమాయిషీని వార్డుకమిటీకి అప్పగించాలి. ఆవార్డులోని మౌలికసదుపాయాల కల్పనకుద్దేశించిన ఖర్చంతా ఆకమిటీ పర్యవేక్షణలో జరగాలి.

4. స్థానిక ప్రభుత్వంలో పాలనా సమాచారహక్కుని పూర్తిగా అమలుచేసి, ఇంటిపన్నులు, ఇతర సేవలని గూర్చిన వివరాలని, ఏఆస్తిపై ఎంతపన్నువేస్తున్నారో వివరాలని ప్రజలముందుంచాలి. అన్ని పాలనాసంబంధమయిన అంశాలని, ఆస్తులని, భూములని గూర్చిన వివరాలు ప్రజలకి నిరంతరం తెలియజెప్పాలి.

5. అన్ని సేవలకి పౌరసేవాపత్రాలని (సిటిజన్స్ చార్టర్లు) ప్రకటించి, సకాలంలో సేవలందకపోతే పరిహారాన్ని ఏర్పాటుచేయాలి.

6. నగరాలలో మెట్రోపోలిటన్ ప్లానింగ్ కమిటీని ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగం నిర్దేశించిన మేరకు నియమించి, ఆ కమిటీ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి సంస్థని, ఇతర సంస్థలని ఉంచాలి.

7. జిల్లా మొత్తానికి రాజ్యాంగం నిర్దేశించిన మేరకు జిల్లా ప్రణాళికా మండలిని ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పాటుచేసి, ఆ మండలి ఆధ్యక్షుడిని జిల్లా ప్రజలంతా ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటుచేసి, అన్ని అధికారాలని, బాధ్యతలని ఆ జిల్లా ప్రణాళికామండలికి అప్పగించాలి.

8. స్థానిక ప్రభుత్వంలో అవకతవకల నివారణకి ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటుచేసి, అవినీతి, అలసత్వం, అసమర్ధత రుజువయితే వారిని పదవులనుండి తొలగించటంతోసహా జరిమానాలు విధించే అధికారాన్ని వారికివ్వాలి.

ఈ సంస్థాగత ఎజెండాకాక, ప్రతి పట్టణానికి అక్కడి పరిస్థితుల్నిబట్టి ఓనిరిష్టమయిన ఎజెండాని స్థానికపార్టీ శాఖ తయారుచేయాలి. ఎన్నికల సమయంలోను, ఆతరువాత, ఈ ఎజెండాని ప్రజలముందు పెట్టటం, ఓటర్లని చైతన్యం చేయటం పార్టీ కార్యక్రమంకావాలి. దాంతోపాటు ప్రతివార్డులో, పోలింగ్‌స్టేషన్ వారీగా పార్టీ చొరవతో ఎన్నికలు జరిపించి, వార్డుకమిటీలని మనమే ఏర్పాటుచెయ్యాలి. రేపు ఎన్నికయే కార్పొరేటర్/కౌన్సిలర్‌ని ఆకమిటీలకి అధ్యక్షుడుగా ఆహ్వానించుకుని, వార్డుస్థాయిలో కావలసిన మార్పులకి రంగం సిద్ధంచెయ్యాలి.

పైన పేర్కొన్న ఎజెండా, కార్యాచరణ అతికీలకమైనవి. స్థానిక నాయకత్వం పార్టీసభ్యులకి ఈ అంశాలపై శిక్షణనిచ్చి, అవగాహన కల్పించాలి. ఈఎజెండాని ప్రజలలో విస్తృతంగా ప్రచారంచెయ్యాలి. వార్డుకమిటీలకి మనమే పునాదులువేసి, తగిన చట్టాన్ని ప్రభుత్వం తేకపోయినా, ప్రజల భాగస్వామ్యానికి పునాదులు వెయ్యాలి.

ఈఅంశాలపై విస్తృత ప్రచారం చేపట్టమని, ప్రజలని చైతన్యవంతుల్ని చెయ్యమని, స్థానిక ప్రభుత్వాల సాధికారతకి, ప్రజల భాగస్వామ్యానికి, నూతన రాజకీయానికి పునాదులు వెయ్యమని పార్టీ స్థానిక నాయకత్వాన్ని, సభ్యులని కోరుతున్నాము.

(జయప్రకాష్ నారాయణ్)